# నిజాయితీ

క్రోణపురాన్ని, వీరశేనుడు అనే రాజు పరిపాలించే వాడు. ఆ రాజు ప్రజారంజకుడు. ప్రజలను, తన కన్న బిడ్డలవలె చూసుకునే వాడు. దాన ధర్మాలు చేయడంలో కూడా ఆ రాజుకు మంచి పేరు ఉంది!

వీరశేనుడు, తన రాజ గృహానికి గృహ ద్వారం ముందు ఒక చిత్రమయిన, అందమయిన బంగారపు గంటను వ్రేలాడ దీశాడు. రాజమందిరం లోనికి, అతిధులెవరైనా వచ్చిన యెడల, ఆ గంట దానంతటదే మ్రోగుతుంది. ఆ గంట మ్రోగిన వెంటనే రాజభటులు వచ్చి. ఆ వచ్చిన వారిని రాజుగారి దగ్గరకు తీసుకు వెళ్ళేవారు. ఇలా వుండగా ఒక రోజు రాత్రి, ఒక దొంగ; కోశాగారంలో ధనం దోచుకోవటానికిగాను రాజగృహము వరకూ వచ్చాడు. ఆ దొంగ, రాజగృహ ద్వారం వరకూ వచ్చేసరికి, యధాప్రకారము ఆ బంగారు గంట ఠంగుమని మ్రోగింది. నిద్రలో వున్న రాజుగారికి ఆ గంట వినపడగానే, గబుక్కున మెలకువ వచ్చింది వెంటనే, బయటకు వచ్చి చూసేసరికి అక్కడ ఎవ్వరూ కనపడలేదు! "ఎవరూ రాకుండానే గంట ఎందుకు మ్రోగిందా!" అని అనుకున్నాడు రాజు.

ఆ తరువాత, వరుసగా ముడు రోజులపాటు అదే విధంగా జరిగింది!

ఇంక వుండబట్టలేక, రాజు తన మంత్రితో, నాలుగు రోజులుగా జరుగుతున్న ఆ సంగతిని చెప్పాడు.

అంతా విని మంత్రి ఒక ఉపాయం ఆలోచించి, వెంటనే "కారణం లేకుండా బంగారు గంట నాలుగు రోజుల నుంచి వరుసగా రాత్రిపూట మ్రోగుతోంది. అది అలా మ్రోగటానికి గల కారణ మేమిటో చెప్పిన రాజుగారు వారికి కోరినంత ధనం ఇస్తారట!" అని, చాటింపువేయించాడు.

ఈ చాటంపు విన్న దొంగ, వెంటనే సరాసరి రాజు వద్దకు వచ్చి, "మహరాజా! పిల్లలతో, దారిద్ర్యంతో, అల్లల్లాడి పోతున్న నేను, తమ కోశాగారంలో ధనం, బంగారం లాంటి ధనం, దోచుకోవటానికిగాను, నాల్గు రోజులనుంచీ వరుసగా వస్తున్నాను. కానీ, నేను వచ్చేసరికి ఆ గంట మ్రోగటం జరుగుతోంది. ఆ గంట విని భయపడి, పారిపోతున్నాను. క్షమించండి ప్రభూ!" అని నిర్భయంగా చెప్పాడు.

వీరశేనుడు, ఆ దొంగ 'నిజాయితీ'కి మెచ్చుకొని, అతనికి కావలసినంత ధనం యిచ్చి పంపేశాడు.

జి. రామలక్ష్మి

